అన్నదాతల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

- ఉల్లి, టమోటా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. సోమవారం పత్తికొండ పట్టణ శివారులోని ఉల్లి, టమోటా పంటలను పరిశీలించి రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉల్లి పంటను సాగుచేసిన రైతు సుంకన్న మాట్లాడుతూ వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి పంటలను సాగుచేస్తే మార్కెట్‌లో ధర లేక తీవ్రంగా నష్టపో యామన్నారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామ చంద్రయ్యతో కలిసి రామకృష్ణ మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో టమోటా, ఉల్లి పంటలను సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీ యంగా మారిందన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లిని, టమోటాలను పొలాల్లోనే వదిలేసిన పరిస్థితి ఏర్ప డిందన్నారు. ఉల్లికి క్వింటానికి రూ.3వేలు, టమోటా కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య మాట్లాడుతూ సీఎం చంద్ర బాబునాయుడికి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి వ్యవసాయ రంగం పట్ల అవగాహన లేదన్నారు. వెల్దుర్తి మండలం కోసానపల్లికి చెందిన ఉల్లి రైతు రామచంద్రకు ఉల్లి పంటకు రూ.3 లక్షల నష్టం రావడంతో మనో వేదనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడ న్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నబీరసూల్, రాజాసాహెబ్, మండల కార్యదర్శి కారుమంచి, జిల్లా సమితి సభ్యులు కారన్న, రామాంజనేయులు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: టమోటా రైతును ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టమోటా మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ రైతులతో మాట్లాడారు. మార్కెట్‌లో గత 20 రోజులుగా కిలో టమోటా రూ.4 మించి ధర పలకడం లేదని రైతులు రామక్రిష్ణ ఎదుట ఆవేదన వ్యక్తం చేయగా రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ నంద్యాల, కర్నూలు కార్యదర్శులు రంగనాయుడు, గిడ్డయ్య, రామాంజినేయులు, రాధాక్రిష్ణ, గార్లదిన్నె మహేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ విజయవాడ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 53 మండలాల నుంచి ప్రతి మండలం నుంచి ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు శిక్షణకు హాజరుకావాలన్నారు. 16, 17 తేదీలలో స్వంత ఆదాయ వనరుల అంశంపై జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో శిక్షణ ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి స్వంత ఆదాయ వనరుల సృష్టి, పన్ను వనరులు, పన్ను వసూళ్లలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పిస్తారన్నారు.



జీడీడీపీ లక్ష్యం రూ.61,746 కోట్లు

- ఇప్పటికే సాధించిన పురోగతి రూ.10,338 కోట్లు
- జీడీడీపీ లక్ష్య సాధనలో రాష్ట్రంలో 22వ స్థానం
- మూడేళ్లలో పెరిగిన వృద్ధి రేటు
- ఈ ఏడాది తలసరి ఆదాయం రూ.2,25,099
- స్థూల ఉత్పాదకతలో సమృద్ధి

జిల్లా స్థూల ఉత్పాదకత (జీడీడీపీ)లో వృద్ధిరేటు పెంచుకుంటూ ముందడుగు వేస్తుంది. గత ఏడాదిలో జీడీడీపీ రూ.52,820 కోట్లు సాధిస్తే, 2025-26 ఆర్థిక సంవత్సరం రూ.61,746 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరి ఏడాది స్థూల ఉత్పత్తి రూ.42,368కోట్లు సాధించింది. కేవలం ఈరెండేళ్లలో రూ.19,378 కోట్లు పెంచుకోవడం ఆర్థిక వృద్ధిరేటుకు సూచికగా నిలుస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాల్లో కందనవోలు జిల్లా ఆర్థిక పురోగతి వైపు అడుగులు వేస్తుంది.

సమృద్ధి సాధించినట్లే..

జిల్లా ఆర్థికంగా ఏస్థాయిలో అభివృద్ధి సాధిస్తుందో చెప్పే సూచిక జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ). గడిచిన మూడేళ్లలో సాధించిన జీడీడీపీ, 2025-26 లక్ష్యం రికార్డులు పరిశీలిస్తే సమృద్ధి సాధించినట్లే ఉంది. రాష్ట్రంలో లక్ష్య సాధనలో 22వ స్థానంలో ఉన్నాం. 2022-23లో రూ.48,052 కోట్లు, 2023-24లో రూ.47,362 కోట్లు, 2024-25లో రూ.52,820 కోట్లు జీడీడీపీ సాధించాం. అంటే ఏటేటా పెరుగుదల ఉంది. గతేడాది కంటే 16.23 శాతం వృద్ధిరేటు పెంచుకున్నారు. ఈ ఐదు నెలల్లో రూ.10,338 కోట్లు స్థూల ఉత్పత్తి అంటే లక్ష్యంలో 16.74 శాతం సాధించారు. మిగిలిన ఏడు నెలల్లో 83.86 శాతం అంటే రూ.51,408 కోట్లు సాధించాలి. వ్యవసాయ దిగుబడులు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తున్నాయి. సేవలు కూడా మెరుగు పడుతున్నాయి. ఫలితంగా గడువులోగా లక్ష్యం సాధిస్తామని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

కర్నూలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్య సాధనలో 22వ స్థానంలో ఉంది. దీనిని మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2,25,099 సాధించాలని లక్ష్యం. జీడీడీపీ(గ్రాస్ డిస్ట్రిక్ డొమెస్టిక్ ప్రొడెక్ట్), తలసరి ఆదాయం మెరుగు పురుచుకోవాలంటే ఆయా రంగాల్లో మరింతగా వృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్లు, ఎస్పీలతో సోమవారం సమావేశం జరిగింది. కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరయ్యారు. జిల్లా పురోగతిపై కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



వ్యవసాయానుబంధ రంగాల...

వ్యవసాయానుబంధ రంగాల కేటగిరిలో వ్యవసాయం, ఉద్యానం, మాంసం, చేపలు, కోళ్ల పెంపకం ద్వారా వచ్చే ఆదాయాన్ని స్థూల విలువ జోడింపు (జీవీఏ) లెక్కిస్తారు. ఈ కేటగిరిలో రెండేళ్ల తీవ్రమైన కరువు వెంటాడడంతో రాబడి భారీగా తగ్గిందనే చెప్పాలి. జీవీఏ 2022-23లో రూ.17,133 కోట్లు వచ్చింది. ఈ తరువాత అతివృష్టి, అనావృష్టి కారణంగా వ్యవసాయ రంగం దెబ్బతినడంతో 2023-24లో రూ.14,810 కోట్లు, 2024-25లో రూ.15,730 కోట్లకు తగ్గింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో జీవీఏ రూ.18,985 కోట్లు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఆగస్టు, సెప్టెంబరు ఆరంభంలో కురిసిన అతి వర్షాలకు పత్తి, ఉల్లి, టమోటా పంటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో జీవీఏ లక్ష్యం సాధ్యమేనా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. ఈ నెలల్లో రూ.1,530 కోట్లు అంటే 8.06 శాతం మాత్రమే లక్ష్యం చేరుకున్నారు. రాష్ట్రంలో 23వ స్థానంలో ఉంటే కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లా 21వ స్థానంలో ఉంది. జిల్లాలో కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ.. వంటి సాగునీటి వనరుల ద్వారా సాగునీరు పుష్కలంగా అందుతున్నాయి. వ్యవసాయ రంగంలో జీవీఏ మెరుగ్గానే ఉంది.

పారిశ్రామిక రంగంలో..

పారిశ్రామిక రంగంలో రాబడి హెచ్చుతగ్గులు చూపుతుంది. ఈ రంగంలో స్థూల విలువ జోడింపు (జీవీఏ) 2022-23లో రూ.10,200 కోట్లు వస్తే, 2023-24లో రూ.9,050 కోట్లకు పడిపోయింది. ఆ తరువాత కాస్త పుంజుకొని రూ.10,092 కోట్లకు చేరింది. జిల్లాలో ఆశించిన స్థాయిలో పరిశ్రమలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

మిగతా 8వ పేజీలో

సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు హాస్పిటల్/ కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని జేసీ నవ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 16 వరకు పోషక్ వేడుకలు జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా జరుగుతాయన్నారు. సెప్టెంబరు 17న మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఐదు థీమ్‌లపై ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ, డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ పాల్గొన్నారు.



పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న జేసీ

ఓజోన్ ఫర్ లైఫ్

- ఇదే మనందరి నినాదం కావాలి
- నిర్లక్ష్యం వహిస్తే భావితరాలకు ముప్పే
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినం

6

అక్రమాలపై చర్చకు సిద్ధమా? : సోమిశెట్టి



మాట్లాడుతున్న 'కుడా' చైర్మన్ సోమిశెట్టి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో వైసీపీ చేసిన అక్రమాలు, భూ కబ్జాలకు సిద్ధమా? అని ఆ పార్టీ నాయకులకు 'కుడా' చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు సవాల్ విసిరారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి టీజీ భరత్ నగరంలోని ఏ.బీ.సీ క్యాంపుల్లో ఉన్న స్థలాలను కబ్జా చేస్తున్నారంటూ వైసీపీ నాయకులు, ఆపార్టీ అనుకూల మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీజీ కుటుంబానికి అక్రమాలు, భూకబ్జాలకు పాల్పడిన అవసరమేలేదన్నారు. కబ్జాకోరల్లో ఉన్న ఏ.బీ.సీ క్యాంపుల్లోని క్వార్టర్లకు సంబంధించి గతంలో జగన్ అనే వ్యక్తి లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడన్నారు. లోక్ అదాలతో తీసుకున్న నిర్ణయంతోనే జిల్లా యంత్రాంగం క్వార్టర్లను ఖాళీ చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. గత వైసీపీ పాలనలో జిల్లాలో దోచుకున్న అక్రమాస్తులు, దోపిడీని కక్కిస్తామని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఇక ఓ ప్రజాప్రతినిధి అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కార్పొరేటర్ జకియా అన్సారీ, టీడీపీ నాయకులు సోమిశెట్టి నవీన్, వి.హనుమంతరావు చౌదరి, నాగరాజు, అబ్బాస్, పోతురాజు, రవికుమార్, పాల్గొన్నారు.

జీఎస్టీ వసూళ్లలో జిల్లా ముందంజ

వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ



కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే కర్నూలు జిల్లా ముందంజలో ఉందని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జే.నీరజ తెలిపారు. సోమవారం గుత్తి పెట్రోలు బంకు సమీపంలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టులో రూ.66 కోట్లు జీఎస్టీ రాగా, ఈ సంవత్సరం ఆగస్టులో రూ.86 కోట్లు వసూలైందన్నారు. ఈ మేరకు 70 శాతం వృద్ధి కనిపించిందన్నారు. జిల్లాలో జైరాస్ ఇస్పాత్, జేఎస్‌డబ్ల్యూ, పాణ్యం సిమెంట్, జైజ్యోతి, గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, మైనింగ్, సిమెంట్, ఐరన్ ఓర్ తదితర కార్యకలాపాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. సంవత్సరానికి రూ.920 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించారన్నారు. అయితే అప్పటి వరకు రూ.440 కోట్లు వసూలు చేశామన్నారు. ప్రస్తుతం రిటర్న్ దాఖలు, నాన్ ఫెయిలర్స్, ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్ల నుంచి పన్నుల వసూళ్లపైనే అధికంగా దృష్టి కేంద్రీకరించామన్నారు. గత నెల ఆగస్టు నుంచి ఈ నెల ఇప్పటి వరకు రూ.12 లక్షలు వసూలు చేశామన్నారు. పాతబకాయిలు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. మొండి బకాయిలు ఉన్న వారి స్థిరాస్తులను అటాచ్ చేయడంతోపాటు నోటీసులు జారీ చేసి ఆస్తులను జప్తు చేసి వేలం వేస్తామన్నారు. అదేవిధంగా వృత్తి పన్ను రూ.2 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం ఒక్క నెలకే రూ.1.50 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. 30 శాతం వృద్ధి సాధించినట్లు ఆమె తెలిపారు. అన్ని పన్నులూ కలిపి ప్రతి నెలా రూ.2కోట్ల లక్ష్యంగా వసూలు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు.

అర్జీలను గడువు లోపు పరిష్కరించాలి: జేసీ

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జేసీ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జేసీ అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందన్నారు. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. పీజీఆర్‌ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చూడాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించిన ఆదోని సబ్ కలెక్టర్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ, ఏపీఐఐసీ జెడ్ఎంల వద్ద ఒక్కొక్క దరఖాస్తులు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని బీయాండ్ ఎస్ఎల్ఏకి వెళ్లకుండా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గోడ కూలి విద్యార్థి దుర్మరణం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కవాడీ వీధిలో ఓ ప్రైవేటు స్కూల్ ప్రాంగణంలో గోడ కూలి షేక్ రహీబ్‌బాషా (7) అనే విద్యార్థి దుర్మరణం చెందాడు. స్థానిక కాలనీకి చెందిన రహీబ్ బాషా ఆ స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు. తల్లిదండ్రులు వాజీదా, మొహిద్దీన్ బాషాలకు ఇద్దరు కొడుకులు కాగా పెద్ద కొడుకు మూడో తరగతి చదువుతున్నాడు. సోమవారం కూడా తల్లి వాజీదా బేగం తన కొడుకును తీసుకుని పాఠశాలకు వెళ్లింది. పాఠశాలలో ప్రార్థన జరుగుతుండటంతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను యాజమాన్యం బయటే నిలబెట్టింది. పాఠశాల ఎదురుగానే ఓ షెడ్డును ఇటీవలే యాజమాన్యం కొనుగోలు చేసింది. ఆ షెడ్డుకు సంబంధించిన గోడ వర్షాలతో బాగా తడిసిపోయింది. చిన్నారి రహీబ్ బాషా, మరో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు అక్కడ నిల్చున్నారు. అయితే గోడ ఉన్నఫళంగా కుప్పకూలింది. ఇటుకలు చిన్నారి రహీబ్ బాషాపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. తల్లి వాజీదా బేగం అక్కడే ఉండటంతో వెంటనే కొడుకును ఆసుపత్రికి తీసుకెళ్లింది. అప్పటికే రహీబ్‌బాషా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి



కూలిన గోడ

ఓజోన్ ఫర్ లైఫ్


- ఇదే మనందరి నినాదం కావాలి
- నిర్లక్ష్యం వహిస్తే భావితరాలకు ముప్పే
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినం



ఆత్మకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాల విశ్వంలో జీవం ఉనికి భూమిపైన మాత్రమే ఉండడం కఠిన వాస్తవం. అలాంటి జీవి మనగడ సాగేందుకు అవసరమైన పర్యావరణాన్ని నిలుపుకోవడం జీవుల ప్రధాన బాధ్యత. అయితే మానవుడు పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటున్నాడు. మానవ జీవన ప్రతిబింబమే పర్యావరణమన్న విషయాన్ని ప్రజలకు వివరించేందుకు ఏటా సెప్టెంబరు 16వ తేదీన ప్రపంచదేశాలన్నీ.. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినంగా ఆనవాతీగా నిర్వహిస్తూ వస్తున్నాయి. ఓజోన్ పొరను దెబ్బ తీస్తున్న పదార్థాల నియంత్రణకు గాను రూపొందించిన మాంట్రియల్ ప్రోటోకాల్‌పై ప్రపంచ దేశాలు ఈ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఆయా దేశాల ప్రతినిధులు 1987 సెప్టెంబరు 16వ తేదిన సంతకాలు చేయగా 1994 నుంచి ఈ దినోత్సవాన్ని జరుపుతూ వస్తున్నారు. కాగా భూమి మీద కాలుష్యం కారణంగా దెబ్బతింటున్న ఓజోన్ పొరను పరిరక్షించేందుకు నేషన్స్ జనరల్ అసెంబ్లీ ఈ ఒప్పందాన్ని రూపొందించి ప్రపంచ దేశాలన్నింటిని దీనిపై అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి భూమిపైభాగంలో స్ట్రాటోస్పియర్ ఆవరణలో ఉన్న ఓజోన్ పొర భూమి మీదికి వచ్చే అన్ని విశ్వకిరణాలను అడ్డుకుని భూమిని పరిరక్షిస్తోంది. రసాయన కాలుష్యాల ప్రభావ ఫలితంగా ఓజోన్ పొరకు చిల్లుపడినట్లయితే సూర్యుడి నుంచి అతినీలలోహిత కిరణాలను నేరుగా భూమ్మిదకు ప్రసరించి మానవజాతికి, సమస్త జీవజాతులకు ప్రమాదకరంగా మారనుంది.

ఓజోన్ పొర వినాశనం వల్ల కలిగే దుష్పరిణామాలు

గాలి, నీరు, వాయు కాలుష్యాల ద్వారే వాతావరణ మార్పులు సంభవించి ప్రకృతి వనరులకు ఆటంకం కలుగుతోంది. ప్లాస్టిక్ వంటి వస్తువుల వాడకం వల్ల చెట్టు, చీమలతో పాటు అన్ని జీవులతో పెనుభూతంగా మారుతోంది. భూమిలో నీరునిల్వలు కనుమరుగయ్యేందుకు కూడా ప్లాస్టిక్ ప్రభావం ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 20 నుంచి 30లక్షల మంది చర్మ కేన్సర్ బారిన పడుతున్నారు. వారిలో 20శాతం పైగా రోగులు సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు నేరుగా సోకిన ఫలితంగా కేన్సర్ బారిన పడినట్లు అంచనా వేశారు.



ఏటా ఒక్కో నినాదంతో అవగాహన

ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఓ నినాదంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఓజోన్ ఫర్ లైఫ్ అనే నినాదాన్ని నిర్ణయించారు. ప్రస్తుతం జరుగుతున్న పర్యావరణ వినాశన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మన భూమికి ఓజోన్ పొర ప్రాముఖ్యతను, భవిష్యత్ తరాలకు దాన్ని రక్షించాల్సిన ఆవశ్యకతను తెలియజేసేలా ఈ నినాదాన్ని ఎంపిక చేశారు.

ఓజోన్ పొర పరిరక్షణలో టాప్‌లో నిలిచిన భారత్



ఓజోన్ పొరను పరిక్షించడంలో మనదేశం ప్రపంచ దేశాలకెల్లా ముందంజలో ఉంది. ఓజోన్ పొరకు హాని కలిగించే పలు పదార్థాల తయారీని నిషేధించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇందులో భాగంగా మాంటియల్ ప్రోటోకాల్ సంబంధిత చర్యల అమలుకు గానూ 1993 నుంచి భారత్ పలు కార్యక్రమాలను చేపట్టింది. సీఎఫ్‌సీ, హాలోన్, సీటీసీ వంటి పదార్థాల ఉత్పత్తి వినియోగాన్ని నిలిపివేసేందుకు గానూ 296 కన్వర్షన్ ప్రాజెక్టలను భారత్ ఆమోదించింది. ఈ క్రమంలో 2008 ఆగస్టు నాటికి ఓజోన్ పొరకు హానీ కలిగించే క్లోరోఫోరో కార్బన్‌ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధించింది. మాంట్రియల్ ప్రోటోకాల్‌ను అత్యుత్తమంగా అమలుచేసిన దేశాలకు ఇచ్చే అవార్డును భారత్ కైవసం చేసుకుంది. మాంట్రియల్ ప్రోటోకాల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా కెనడాలోని మాంట్రియల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 2007 సెప్టెంబరు 16వ తేదీన ఈ అవార్డును దక్కించుకుంది.

ఓజోన్ పొర పరిరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు

అవసరమైనంత వరకు వాయు, జల, శబ్ద కాలుష్యం జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంధనం, విద్యుత్ పొదుపు చేపట్టాలి. తద్వారా బొగ్గు, ఇంధన వినియోగం నియంత్రించడం వల్ల భవిష్యత్ తరాలకు వనరులను అందించడమే కాకుండా పర్యావరణ విఘాత సమస్యను పరిష్కరించవచ్చును. కాలుష్యం ఉత్పన్నమయ్యే వాహనాల వినియోగాన్ని తగ్గించాలి. అవసరమైనంత వరకు వారం ఓ రోజు ప్రజారవాణా చేపట్టాలి. అలాగే ఇంధనరహిత వాహనాలైన సైకిళ్లను ఉపయోగించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే ఓజోన్ పొరతో పాటు భూగర్భజలాలను కూడా సంరక్షించవచ్చు. పరిశ్రమలు, మరే ఇతర కాలుష్య కారకాల నియంత్రణకు తోడ్పాటునందించాలి. చెట్లను పెంచతూ.. పచ్చదనం.. పరిరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించాలి. అలాగే అడవుల ప్రాధాన్యతను కూడా వివరించాలి. విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన అంశాలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం సైతం కాలుష్య కారకాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో నివారించాల్సి ఉంది. వివిధ కాలుష్యాల బారిన పడి ధరణిమాత విలపిస్తోంది. ఓజోన్ పొరకు పడ్డ చిల్లులను పూర్చడం ద్వారే ఈ సమస్యలను అరికట్టేందుకు అవకాశం ఉంది. ఇందుకోసం ప్రపంచదేశాలన్నీ చిత్తశుద్ధితో ఓజోన్ పొర పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలి.

మొక్కలు నాటాలి



మొక్కల పెంపకంతోనే ఓజోన్ పొర పరిరక్షణ సాధ్యపడుతుంది. 50ఏళ్ల చెట్టు వల్ల సుమారు రూ.50 లక్షల ఉపయోగం ఉంది. ఈ విషయాన్ని గుర్తించని మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. ఐరాస ఇచ్చిన సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30కోట్ల హెక్టార్లలో అడవులు ఉండగా ప్రస్తుతం 2 నుంచి 3 కోట్ల హెక్టార్ల వరకు అడవులు క్షీణించాయి. ప్రజలు కూడా ఓజోన్ పొర వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

● మగ్బుల్‌బాషా, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బనగానపల్లె రేంజ్

రాంబొట్ల దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టాలి: వీహెచ్‌పీ



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో సుమారు 110 సంవత్సరాల చరిత్ర కలిగిన అతి పురాతన దేవాలయం రాంబొట్ల దేవాలయం శిథిలావస్థకు చేరుకుంటోందని, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని ఆ శాఖ అధికారులు వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీ, ఇతర అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పాతనగరంలోని రాంబొట్ల దేవాలయాన్ని వీహెచ్‌పీ నాయకులు సందిర్శంచారు. వీహెచ్‌పీ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ రాంబొట్ల దేవాలయం పరిస్థితిపై తాము కొన్ని డిమాండ్లను దేవదాయ శాఖ అధికారులకు తెలియజేశామని తెలిపారు. టీటీడీ వారు నిర్మించిన కల్యాణ మంటపం నిరుపయోగంగా మారిందని, దాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ దీపిక, కార్పొరేటర్లు వాసు, శేషయాదవ్, నాయకులు, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువ ఇంజనీర్లకు స్ఫూర్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య

● జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా



విద్యార్థినికి నగదు బహుమతి, పురస్కారం అందజేస్తున్న జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా తదితరులు

కర్నూలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లకు ఇంజనీరింగ్ పితామహుడు, దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిదాయకమని ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా అన్నారు. సోమవారం రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం నాయకులు రిటైర్డ్ ఈఈ విశ్వనాథ్ ఆధ్వర్యంలో 'జాతీయ ఇంజనీర్ల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి, మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా సీఈ కబీర్‌బాషా మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ప్రాజెక్టుల నిర్మాణంలో సత్తా చాటిన గొప్ప మేధావి దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈఎన్‌సీ జలంధర్, రిటైర్డ్ సీఈ మురళీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలం గేట్లు మూసివేత



మూసివేసిన గేట్లు

శ్రీశైలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. సోమవారం డ్యాం గేట్లన్నీ మూసివేశారు. జలాశయంలో గరిష్ఠ స్థాయి నిల్వలతో నిలకడగా ఉంచారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి 76,328 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం డ్యాం నీటిమట్టం సాయంత్రం 6గంటల సమయానికి 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలుగా నమోదైంది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం 66,234 క్యూసెక్కులు విడుదల చేశారు.

'మూడు లక్షల ఎకరాలకు అందని నీరు'



మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు ఈఏడాది 100 రోజులు వరద వచ్చినా జలవనరుల శాఖ నిర్లక్ష్యంతో మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందలేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆ సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ నీటి హక్కులపై ఏ విధంగా దాడి జరుగుతుందో తెలుసుకునేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్‌ను సందర్శిస్తామన్నారు. శ్రీశైలానికి వచ్చే వరద 30 రోజులకు మించి ఉండని నేపథ్యంలో రిజర్వాయర్లను 30 రోజుల్లో నింపి 7,50,000 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉందన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో చింతలాముని నల్లారెడ్డి స్వామి వారి దశమి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలు సోమవారం నిర్వహించారు. విజేతలకు సోమవారం రాత్రి నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఆరుపళ్ల సైజ్ పోటీలలో ప్రథమ బహుమతి కర్నూలు జిల్లా బీఎల్‌కే వెంకటగిరికి చెందిన ఎద్దులు రూ. 40వేలు, రెండో బహుమతి గుంటూరు జిల్లా శ్రీనివాసులు ఎద్దులు రూ. 30వేలు, మూడో బహుమతి కర్నూలు జిల్లా బీఎల్‌కే వెంకటగిరి ఎద్దులు రూ. 20వేలు, నాలుగో బహుమతి కొత్తూరు గ్రామ బీఎస్ఎస్ రెడ్డి ఎద్దులు రూ. 10వేలు గెలుచుకున్నాయి. నాలుగు పళ్ల సైజ్ పోటీలలో మొదటి బహుమతి చిన్ననేలటూరు గ్రామానికి చెందిన కుమారస్వామి ఎద్దులు, రూ. 30వేలు రెండో బహుమతి పగిడ్యాల గ్రామానికి చెందిన రవికుమార్ ఎద్దులు రూ. 20వేలు, మూడో బహుమతి రోళ్ల పాడు ప్రభాకర్‌రెడ్డి ఎద్దులు రూ. 15వేలు గెలుచుకున్నాయి. అలాగే న్యూ కేటగిరి బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి రూ.50 వేలు ప్రకాశం జిల్లా శేషాద్రి చౌదరి ఎద్దులు గెలుచుకున్నాయి. రెండో బహుమతిని గుంటూరు జిల్లా చౌదరి కొండబాలవారి పాలేం ఎద్దులు రూ.40 వేలను, మూడో బహుమతి రూ. 30 వేలు నాగర్‌కర్నూలు రాయవరం గ్రామానికి చెందిన అక్షరరెడ్డి ఎద్దులు, నాలుగో బహుమతి రూ. 20వేలను అనంతపురం జిల్లా ఆముదాల రమేష్ ఎద్దులు గెలుచుకున్నారు. అలాగే ఐదో బహుమతి రూ. 10వేలను గద్వాల జిల్లా మేడి కొండ సద్దామ్ హుసేన్, ఆరో బహుమతిని ఎమ్మిగనూరు దుబ్బన్న, రంగస్వామి ఎద్దులు రూ. 5వేలను గెలుచుకున్నాయి. వారికి నగదు బహుమతి అందజేశారు. నిర్వాహకులు ఉసేన్, రెహంతుల్లా, శివన్న, నూర, గోపాల్, వెంకటేశ్, మాబు, భాస్కర్ పాల్గొన్నారు.

కర్నూలు యార్డుకు 18,099 క్వింటాళ్ల ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు సోమవారం రైతులు భారీగా ఉల్లి గడ్డలు అమ్మకానికి తెచ్చారు. గత రెండు రోజులుగా ఉల్లి అమ్మకాలు జరగకపోవడం, మరోవైపు దసరా పండుగ సమీపిస్తుండటంతో రైతులు పెద్ద ఎత్తున ఉల్లిని అమ్మకానికి తెస్తున్నారు. రైతులకు మార్క్‌ఫెడ్ అండగా నిలబడి ప్రభుత్వం నిర్ణయించిన క్వింటానికి రూ.1,200ల ధర చెల్లించి కొనుగోలు చేయడంతో వ్యాపారుల బారిన పడి నష్టాన్ని చవిచూడాల్సిన పరిస్థితి రైతులకు తప్పి పోయింది. మార్క్‌ఫెడ్ డీఎం రాజు, సిబ్బంది మౌలాలి తదితరులు రైతుల నుంచి ఏకంగా 10,022 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేశారు. మిగిలిన 8,077 క్వింటాళ్ల ఉల్లిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఒక ప్రభుత్వ సంస్థ ఇంత పెద్ద మొత్తంలో ఒకేరోజు రైతుల నుంచి గతంలో ఎప్పుడూ కొనుగోలు చేయలేదని మార్కెట్ కమిటీ అధికారులు తెలిపారు.

నేడు ఉల్లి వేలం

కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని మంగళవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య ఆధ్వర్యంలో అమ్మకాలు నిర్వహిస్తున్నామని మార్క్‌ఫెడ్ మేనేజర్ తెలిపారు. ఈ వేలంలో జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, హోటల్ యజమానులు పాల్గొనాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఉల్లికి క్వింటానికి ప్రకటించిన రూ.1,200లు ఒక కర్నూలు యార్డులోనే కాకుండా తాడేపల్లి గూడెం మార్కెట్ యార్డులో కూడా విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని ప్రయోజనం పొందాలని మార్క్‌ఫెడ్ డీఎం రాజు కోరారు.

ఆరోగ్య శిబిరాలు నిర్వహించండి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వైద్యపరీక్షలు, ఆరోగ్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ హరిచరణ్ ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి అక్టోబరు 2వరకు నిర్వహించనున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈఎన్‌టీ, రక్తపోటు, రక్తంలో చక్కెరస్థాయిలు, దంత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్‌లు, రోగ నిరోధక సేవలు, మాతాశిశు సంరక్షణ సేవలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఓ.లలిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాట్య కిరీటి సురేష్

- కూచిపూడిలో రాణింపు
- నృత్య ప్రదర్శనల్లో చిన్నారులకు శిక్షణ
- నాట్యాచార్యుడు సాంబశివ పర్యవేక్షణలో ఎదుగుదల
- సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పనిచేశారు
- కూచిపూడిలో ఎంఏ పట్టా
- పలువురితో ప్రశంసలు



నాట్యగురువులతో ప్రవీణ పురస్కారం అందుకుంటున్న సురేష్



నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ నృత్యాల్లో కూచిపూడి ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి అనే గ్రామం నుంచి నాట్యం ఉద్భవించింది. కూచిపూడి నాట్యం భరత నాట్యానికి దగ్గరి పోలికలు ఉంటాయి. కూచిపూడికి ప్రత్యేక నాట్యరీతులున్నాయి. కూచిపూడి నృత్యకారులు స్వచ్ఛమైన, వ్యక్తీకరణ నృత్యం, నాట్యం, అభినయం. అభినయం అనగా కూచిపూడి నృత్యంలో ముఖ కవళికలు, చేతిసంజ్ఞల కళ. కూచిపూడి నృత్య కారులు నృత్యం యొక్క భావోద్వేగాలను, అర్థాన్ని తెలియజేయడానికి అభినయాన్ని ఉపయోగిస్తారు. కూచిపూడి నృత్యప్రదర్శనలో నంద్యాలకు చెందిన పల్లంశెట్టి సురేష్ కృషిచేస్తున్నారు. సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌ను(2012) స్థాపించి కూచిపూడి నృత్య ప్రదర్శనలో వందలాది మంది చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. సురేష్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సినిమాలపై ఆసక్తితో..

నంద్యాల ఎస్‌బీఐ కాలనీకి చెందిన వెంకటసుబ్బయ్య, రాజేశ్వరీ దంపతుల కుమారుడు పల్లంశెట్టి సురేష్. పదో తరగతి వరకు నంద్యాల పురపాలక పాఠశాలలో చదివారు. సినిమాలపై ఆసక్తితో హైదరాబాద్‌కు వెళ్లారు. సినిమాల్లో సైడ్ డ్యాన్సర్‌గా పనిచేశారు. నాట్యాచార్యుడు మునుకుంట్ల సాంబశివ ఆదరణతో నృత్యంలో అంచెలంచెలుగా ఎదిగారు. కొద్దిరోజులు కూచిపూడి కళాకారిణి పద్మకళ్యాణి వద్ద నృత్యంలోని మెలకువలు నేర్చుకున్నారు. కృష్ణాజిల్లా అగ్రహారంలో రాధేశ్యామ్ గురువువద్ద కూచిపూడి కోర్సుచేశారు. హైదరాబాద్‌లోని భక్త రామదాస్ కళాశాలలో కూచిపూడి డిప్లొమా పూర్తిచేశారు. కూచిపూడి ఎంఏ చదివి పట్టా పొందారు. పలువురికి నృత్య ప్రదర్శనలో శిక్షణ ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు.

ప్రదర్శనలు

- 2011లో నంద్యాలలో 11గంటల పాటు నిరవధికంగా నృత్య ప్రదర్శన చేశారు.
- 2012లో పేద కళాకారుల సహాయనిధి కోసం ప్రదర్శనలిచ్చారు. కూచిపూడికి ఆదరణ పెంచేందుకు వందలాది మంది కళాకారులతో కలిసి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రశంసలు పొందారు.

పురస్కారాలు

- 2015లో కేంద్ర ప్రభుత్వం ఐసీసీఆర్ ఆధ్వర్యంలో ప్రపంచ జానపద నృత్యోత్సవాల్లో శిల్పారామంలో చేపట్టిన నృత్యోత్సవాల్లో నాట్య గురువు పురస్కారం
- 2016లో వెంపటి చినసత్యం జయంతి సందర్భంగా నిర్వహించిన నృత్యప్రదర్శనలో నిఘాంటిక నాట్య జ్ఞానపీఠ్ పురస్కారం అందుకున్నారు. అదే సంవత్సరం టీటీడీ వారి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ సాంస్కృతిక పురస్కారం దక్కించుకున్నారు.
- 2017లో తెలంగాణలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో నాట్య నిపుణ పురస్కారాన్ని పొందారు.
- 2018 జనవరిలో మహాత్మా జ్యోతిరావ్‌పులే సేవారత్న జాతీయ అవార్డు. అదేసంవత్సరం మార్చిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.
- 2022 ఆగస్టులో తిరుపతిలో అభినయ ఆర్ట్స్ వారిచే హనుమాన్ అవార్డు. శ్రీశైలంలో తిరుపతి నాట్యశిఖ అవార్డు. అదే ఏడాది సెప్టెంబరులో చెన్నైకు చెందిన హ్యూమినిటీ గ్లోబల్ పేస్ ఫెడరేషన్ వారి కూచిపూడి కళారత్న అవార్డుతో సత్కరించారు. విజయవాడకు చెందిన వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం వారిచే నృత్య విజ్ఞాన్ పురస్కారం అందుకున్నారు.
- 2022లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వారు ప్రకటించిన జూనియర్ ఫెలోషిప్ అవార్డుకు ఏపీ నుంచి సురేష్ ఒక్కరే ఎంపికయ్యారు.
- 2023లో రామ అన్నమయ్య నాట్యవైభవం పురస్కారం. కాణిపాకం శేషాద్రి జ్ఞానపీఠ అవార్డు, తిరుమల ఉత్తమ సేవా పురస్కారం, నాట్య నిపుణ షోడశ నాట్యగురు అవార్డు, హైదారాబాదులో నర్తన మానస అవార్డు. శ్రీశైలంలో స్మారక సమ్మాన్, కోల్‌కత్తాలో నారయణి నంది అవార్డు.
- 2024లో తిరుపతి వినాయక సంగీత నృత్యవైభవం అవార్డు, విజయవాడ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో పురస్కారం. కర్నూలులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు. ఢిల్లీ వినాయక నాట్య నందీశ్వర పురస్కారం.
- 2025లో రాజమండ్రి రాయలసీమ నృత్య రత్న పురస్కారం. ప్రొద్దుటూరులో స్వర్ణ మం జరి అవార్డు. చెన్నైలో తాండవ నృత్య ప్రవీణ పురస్కారం, శ్రీశైలంలో నాట్య గందర్వ అవార్డు.
- ఈ ఏడాది జనవరి 24న కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్‌భారత్ రింగ్ మహోత్సవంలో పాల్గొని వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు.
- మార్చిలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఏపీ భవన్‌లో ఏపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో కూచిపూడి ఉత్సవాల్లో పాల్గొని పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్, కమిషనర్ లవ్‌అగర్వాల్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



2025లో రామఅన్నమయ్య నాట్య వైభవం పురస్కారం అందుకుంటున్న సురేష్

ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవలో తరిస్తా

ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవలో తరిస్తా. లక్ష్యం లేని జీవితం వృథా. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను గుర్తించి ఉన్నత లక్ష్య సాధనకు కృషిచేయాలి. కష్టం లేకుండా ఏదీ దక్కుదు. పదిమందికి నృత్య ప్రదర్శనలో శిక్షణ ఇస్తున్నా. ఎక్కడ అవకాశం వచ్చినా వదులుకోకుండా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నా.

● పల్లంశెట్టి సురేష్, కూచిపూడి నాట్య కళాకారుడు

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 81 అర్జీలు : ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 81 అర్జీలు వచ్చాయి. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే స్టేషన్ పరిధిలో సుంకేసుల రోడ్డు.. నేతాజీ కాంప్లెక్స్ రైల్వే బ్రిడ్జి సమీపంలో తుంగభద్ర నదిలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతికి వెండి కడియం ఉంది. దానిపైన చిన్నవేలు మల్లమ్మ, నాగిమునెమ్మ, పెద్దవేలు మల్లమ్మ ఈశ్వరుడు, మల్లికార్జున, బండన్న అనే అక్షరాలు తెలుగులో ఉన్నాయి. శరీరంపై నలుపు రంగు చొక్కా ధరించాడు. జేబులో తాళాల గుత్తి ఉంది. ఆటోకు సంబంధించిన మూడు తాళాలు, ఇంటికి సంబంధించిన రెండు తాళాలు అందులో ఉన్నాయి. మృతుని వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9908889696కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

నంద్యాల టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం పట్టణ శివారులోని చాబోలు వద్ద చోటుచేసుకున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వివరాలు.. శిరివెళ్ల మండలం కామినేనిపల్లెకు చెందిన కే.నరసింహ(37)కు తెలంగాణ నిజామాబాద్ జిల్లాకు చెందిన యువతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు రావడంతో వీడి ఉంటున్నారు. దీంతో మనస్థాపం చెందిన అతడు చాబోలు మెట్ట వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కూతురు ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

బెంచ్‌పై నుంచి పడి విద్యార్థినికి గాయాలు

ఆస్పరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బెంచ్‌పై నుంచి పడిన విద్యార్థినికి రక్తగాయాలైన ఘటన మండలంలోని పుటకలమర్రి మోడల్ స్కూల్‌లో సోమవారం జరిగింది. ప్రిన్సిపాల్ ఎస్.సమీల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోడల్ స్కూల్లో ఇంటర్ సెకండియర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థిని శ్రీకన్య ఉదయం 11 గంటల సమయంలో పరీక్షలు రాస్తుండగా ప్రమాదవశాత్తు బెంచ్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థిని క్షేమంగా ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

బాల్య వివాహాన్నిఅడ్డుకున్న పోలీసులు

ఆదోని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారం సోమవారం పోలీసులకు అందింది. వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగిణి వసంతతో పాటు రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్కడికి వెళ్లారు. పెళ్లికూతురు మైనర్ కావడంతో బాలికల తల్లిదండ్రులు, అబ్బాయి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారికి బాల్యవివాహంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండకుండా అమ్మాయికి వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. తెలిసీ తెలియని వయస్సులో వారికి వివాహం చేయడం వల్ల అనర్థాలు తలెత్తుతాయని అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు దాటిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. పెళ్లి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్యాబ్‌ల దొంగలు అరెస్టు

- 77 ట్యాబ్‌లు రికవరీ : ఏఎస్పీ మందా జావళి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల డిప్యూటీ డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న గదిలో ఇటీవలే ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయి. నిందితులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మందా జావళి తెలిపారు. వివరాలు.. పది రోజుల కిందట విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన 90 ట్యాబ్‌లను డిప్యూటీ డీఈవో కార్యాలయంలోని ఓ గదిలో భద్రపరిచారు. చాంద్‌బాడకు చెందిన షేక్ హుసేన్, ఇంకో మైనర్ బాలుడు కలిసి దొంగతనం చేశాడు. ట్యాబ్‌లతో పాటు 150 ఓటీజీ కేబుల్స్, 60 ఆడాప్టార్లు, రెండు స్పైక్ గార్డ్స్ ఎత్తుకెళ్లారు. సోమవారం వారిని బీమవరం రోడ్డులోని ఈద్గా వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 77 ట్యాబ్‌లతో మిలిగిన వాటిని రికవరీ చేశారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది రమణ, అమీర్ బాషా, గురుశేఖర్ పాల్గొన్నారు. ఎస్పీ వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

చెస్ విజేతలకు బహుమతులు



విజేతలతో చెస్ నిర్వాహకులు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల చెస్ సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి చెస్ విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రామసుబ్బారెడ్డి తెలిపారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో మునినాగలక్ష్మి స్మారక రాష్ట్ర స్థాయి ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ స్పాన్సర్ రాజేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేశుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కరరెడ్డి, కోశాధికారి జనార్దన్, డా.నీలాప్రసాద్, డా.భరత్, సుజాత, రాజారమేష్‌చక్రవర్తి, ఇమాం, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలు : ర్యాపిడ్ విభాగంలో శివపవన్‌తేజశర్మ ప్రథమ స్థానం (ఎన్‌టీఆర్ జిల్లా), లక్ష్మిత్ ద్వితీయ స్థానం (కర్నూలు జిల్లా), బ్లిట్జ్ విభాగంలో సాత్విక్ మొదటి స్థానం (కోనసీమజిల్లా), రామచరణ్‌తేజ ద్వితీయ స్థానం (తూర్పుగోదావరి జిల్లా), ఎన్ఆర్‌జీ చెస్ అకాడమీ విభాగంలో నీలేష్, షాలిని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.



మోతాదు మించితే ముప్పే

- యూరియాను అధికంగా వాడితే భూసారం తగ్గే ప్రమాదం
- అవగాహనలేమితో నష్టపోతున్న అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పెరగనున్న వరి సాగు విస్తీర్ణం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలు సత్వరమే ఎదగాలంటే యూరియా వాడకం తప్పనిసరి అన్న పరిస్థితులు నేడు వ్యవసాయ రంగంలో నెలకొన్నాయి. ప్రధానంగా యూరియా వాడితే పంట దిగుబడులు బాగా వస్తాయన్న కారణంతో రైతులు యూరియాను అధికంగా వాడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత వ్యవసాయ విధానంలో గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో రైతులు యూరియాను వినియోగిస్తున్నారన్న విషయం అధికారిక లెక్కలే తేల్చి చెబుతున్నాయి. అయితే యూరియా వినియోగం అతిగా జరిగితే అన్నీ అనర్థాలేనని పర్యావరణ శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భూసారం దెబ్బతిని, నేలలు సహజత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు, నదులు, ప్రధాన కాలువలు, చెరువులు, బోరు బావుల కింద వరి సాగు ముమ్మరంగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వరి సాధారణ సాగు విస్తీర్ణం 78,174 హెక్టార్లు కాగా, ఇప్పటికే 60వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. సహజంగా వరి సాగు చేసిన రైతులు పంట సాగు దగ్గర నుండి నూర్పిడి వరకు మూడు విడతలుగా 25 కేజీల చొప్పున 75 కేజీలు వాడాల్సి ఉంది. యూరియాకు తోడు మరో 75కేజీల కాంప్లెక్స్ ఎరువులు వినియోగించవచ్చు. అయితే రైతులు అవగాహన లేమి కారణంగా మొత్తం 150 కేజీలు(3బస్తాలు) యూరియా, మరో 3బస్తాలు కాంప్లెక్సు ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు ఎరువుల భారం అమాంతం పెరిగిపోతోంది. ప్రస్తుతం ఎరువుల ధరల ప్రకారం చూస్తే రైతులకు ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల సుమారు రూ.6వేలు అదనపు భారం పడుతోంది. సహజంగా ఎకరా వరి పంటకు 72కిలోల నత్రజని మాత్రమే అవసరం అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కాంప్లెక్సు ఎరువుల్లో సైతం నత్రజని మిళితమైవుంటుందని సూచిస్తున్నారు. రైతులుకు సరైన అవగాహన లేక యూరియాను ఎక్కువగా వాడేస్తున్నారని పేర్కొంటున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే, భూమి దెబ్బతినకుండా ఉండటంతో పాటు, రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అంటున్నారు.



ఎక్కువగా వాడితే అనర్థాలే

యూరియాను అతిగా వినియోగించడం వల్ల పకృతి పరంగా అన్నీ అనర్థాలే జరిగే అవకాశం ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ, అధికారులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. క్రమంగా పంట పొలాలు భూసారం కోల్పోయి, కొంత కాలానికి నేలలు తమ సహజత్వాన్ని కోల్పోయి నిస్సారంగా మారే ప్రమాదం ఉందని అంటున్నారు. ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల భవిష్యత్తులో ఎన్ని ఎరువులు వేసినా పంటలు పండకపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సహజంగా భూసారం పెరిగే చర్యలు చేట్టి, ఎరువుల వాడకం తగ్గిస్తే ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంటుంది. పిల్లి పెసర, జనుము తదితర పంటలు సాగుచేసి వాటిని కలియదున్నితే భూసారం పెరిగి దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది. భూసార పరీక్షలు చేయించి, జింక్ వంటి సూక్ష్మ పోషకాలు వినియోగించడం ద్వారా రైతులకు మేలు చేకూరే అవకాశం ఉంటుంది. అయితే రైతులు అవగాహన లేమితో ఎరువులను, ముఖ్యంగా యూరియాను అతిగా వాడుతున్నారు. ఏపంటకు ఎంతమేర ఎరువులు వినియోగించాలన్న విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

ఏ పంటలకు ఎంత ఎరువులు వినియోగించాలన్న విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామస్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే, పెట్టుబడి భారం తగ్గడంతో పాటు, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుంది.

- సుధాకర్, ఏడీ, వ్యవసాయశాఖ

సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణపై రగడ

- రెండు వర్గాల మధ్య విభేదాలు
- స్టేషన్‌కు చేరిన పంచాయితీ



ఆసుపత్రి ఇన్‌గేటు వద్ద అస్తవ్యస్తంగా హనాలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహణ కోసం అధికార పార్టీలో రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇరువర్గాలు పరస్పరం వాగ్వాదానికి దిగి రోడ్డుకెక్కారు. కర్నూలు జీజీహెచ్‌లో 238 మంది సెక్యూరిటీ గార్డుతో తిరుపతికి చెందిన ఈగల్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. అయితే నాయకుడు ఈ ఏజెన్సీని సబ్‌లీజ్ కింద తీసుకుని రెండు నెలలు నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఈ విషయంలో రెండు వర్గాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. తామే ఏజెన్సీని నిర్వహిస్తామని ఓ ప్రజా ప్రతినిధి అనుచరులు కొందరు సోమవారం సెక్యూరిటీ ఆఫీస్‌కు వచ్చి గొడవకు దిగారు. ఇప్పటికే సెక్యూరిటీ ఏజెన్సీ సబ్ లీజు కోసం తాము లక్షల రూపాయలు ఖర్చు పెట్టామని ఏజెన్సీని నిర్వహిస్తున్న ఓ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుచరులు వాదనకు దిగారు. తాము ఈగల్ సంస్థతో అగ్రిమెంటు చేసుకున్నామని, ఖర్చు పెట్టి ఉంటే చెల్లిస్తామని ఇక నుంచి తామే విధులు చూస్తామని ప్రజాప్రతినిధి అనుచరులు అన్నారు. దీంతో సెక్యూరిటీ ఆఫీసు వద్ద కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న నాయకుడి అనుచరులు భారీ స్థాయిలో ఆఫీసుకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. తర్వాత ఈ విషయం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. కర్నూలు జీజీహెచ్‌లో సెక్యూరిటీల వ్యవస్థ గత 2 నెలలుగా అస్తవ్యస్తంగా తయారయింది. ఐదు రోజుల క్రితం ఇన్‌గేటు వద్ద సెక్యూరిటీ గార్డులు ట్రాఫిక్‌ను నియత్రించలేకపోవడం ముగ్గురిపై హాస్పిటల్ సూపరింటెండెంట్ వేటు వేశారు. ఇద్దరు అధికార పార్టీ నేతలు సెక్యూరిటీ ఏజెన్సీ కోసం కొట్టుకోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అధికారులు కూడా ఈ ఇద్దరి నేతల మధ్య తలదూర్చకపోవడంతో హాస్పిటల్ రోగుల భద్రత అదుపు తప్పింది.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులను విస్మరించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక టమోటా, ఉల్లిరైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కర్నూలు ఉల్లి పంటను అమ్ముకుందామంటే రైతులకు నిరాశే మిగిలిందన్నారు. నగర శివారు మునగాలపాడు వద్ద వేయి ఉల్లి బస్తాలను పడేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినిమాలు, నారా లోకేశ్ ఢిల్లీ చుట్టూ, చంద్రబాబు పింఛన్ పంపిణీ చేయడానికి బిజీ బిజీగా తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అన్ని వర్గాలకు మేలు చేయాలని, లేనిపక్షంలో బంగ్లాదేశ్, నేపాల్ ప్రజలు ఎలా తిరగబడ్డారో అలాగే ఏపీలో కూడా జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, జుబేర్ అహ్మద్, షాషావలి తదితరులు పాల్గొన్నారు.





అక్టోబరు 22 నుంచి కార్తీక మాసోత్సవాలు : ఈవో



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో అక్టోబరు 22 నుంచి నవంబరు 21వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు. సోమవారం పరిపాలన భవనంలోని అర్చకులు, సిబ్బందితో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, ఆలయ వేళలు, స్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు, క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ తదతర అంశాలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అన్ని విభాగాలను ఆదేశించారు. డిప్యూటీ ఈవో రమణమ్మ పాల్గొన్నారు.

హంద్రీకి కొనసాగుతున్న నీటి విడుదల



విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి సోమవారం సాయంత్రం 600 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి అధికారులు విడుదల చేశారు. నాలుగైదురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 4 టీఎంసీల వరద చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం రాత్రి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో గేట్లను మూసివేశారు. అయితే సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. ఈ కారణంగా సోమవారం సాయంత్రం జీడీపీ ఏఈ మహమ్మద్‌ఆలీ 4వ గేటును ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని దిగువ హంద్రీనదికి విడుదల చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు 4వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో కొసాగింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, దేవకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాలలో వర్షాలు కురియడంతో వరద నీరు వచ్చి జీడీపీని చేరుతోంది.

మెగా డీఎస్సీలో 2,590 పోస్టులు భర్తీ

- ఉమ్మడి జిల్లాలో అర్హులు లేక భర్తీ కాని పోస్టులు 88



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా తుది జాబితాలో మొత్తం 2,590 ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇందులో అర్హత గల అభ్యర్థులు లేక 88 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 2,678 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆన్‌లైన్ పరీక్ష అనంతరం గతనెల 23న ప్రభుత్వం ఫలితాలను ప్రకటించింది. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటించింది. యాజమాన్యాల వారీగా పోస్టుల భర్తీ ఇలా ఉంది.. ప్రభుత్వ యాజమాన్యాల విభాగంలో నోటిఫై చేసిన పోస్టులు 2,547 కాగా, భర్తీ చేసిన పోస్టులు 2483. అర్హత గల అభ్యర్థులు లేక 64 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మున్సిపల్ కార్పొరేషన్ విభాగంలో నోటిఫై చేసిన పోస్టులు 58 కాగా, 51 భర్తీ అయ్యాయి. 7 పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోయాయి. అలాగే మున్సిపాలిటీలో 40 పోస్టులకు గానూ 28 పోస్టులు భర్తీ చేయగా.. 12 పోస్టులు మిగిలిపోయాయి. ట్రైబల్ చెంచు విభాగాలకు సంబంధించి 33 పోస్టులకు గానూ 28 పోస్టులు భర్తీ అయ్యాయి. అభ్యర్థులు లేక 5 పోస్టులు మిగిలిపోయాయి. అర్హత గల అభ్యర్థులు లేకపోవడం వలన ఆయా కేటగిరిలో మిగిలిన 88 పోస్టులను వచ్చే ఏడాది డీఎస్సీలో భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థుల ప్రశ్నల నివృత్తికి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తాత్కాలిక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ నెంబర్.9440589315, 9440561831, 998504 7704ను సంప్రదించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సీఎం చంద్రబాబు ఈనెల 19న విజయ వాడలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు. జిల్లాలో ఎంపికైన అభ్యర్థులందరూ గతంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేసుకున్న సెంటర్లకు ఈనెల 18న ఉదయం 7 గంటలకు రిపోర్టు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా విజయవాడకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులతో పాటు తోడుగా ఒకరిని విజయవాడకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా అభ్యర్థులు 18వ తేదీన ఉదయం 7 గంటలకు తప్పక రిపోర్టు చేసుకోవాలని పేర్కొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి: కమిషనర్


కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి అర్జీదారుడు సంతృప్తి చెందేలా వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన 23 ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి పాల్గొన్నారు.

● నగరంలో ధోబీఘాట్లకు మరమ్మతులు చేయించి నిధులు కేటాయించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాయలంలో కమిషనర్ విశ్వనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

● స్థానిక బళ్లారి చౌరస్తా జాతీయ రహదారి సర్వీసు రోడ్లపై గుంతలు పూడ్చాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి కమిషనర్‌కు వినతిపత్రం అంద జేశారు.

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాలి

గూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీఐటీయూ మండల అధ్యక్షుడు జే మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం గూడూరు సీఐటీయూ కార్యాలయంలో పార్టీ నాయకుడు గుంటప్ప అధ్యక్షతన మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని చూస్తుందన్నారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జే మోహ న్, కార్యదర్శిగా గుంటప్ప, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, మద్దిలేటి, శాంతన్న, సహాయ కార్యదర్శులుగా శేషమ్మ, ప్రభావతి, రాజుతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

వామ్మో.. జ్వరాలు

● పెరిగిన ఓపీ రద్దీ




మందులు తీసుకునే వద్ద బారులు దీరిన రోగులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు, జ్వరాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. సోమవారం కర్నూలు జీజీహెచ్‌కు ఓపీ రోగుల రద్దీ పెరిగింది. ఆసుపత్రికి వచ్చే 50 శాతానికి పైగా జ్వర బాధితులు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. మెడిసిన్, చిన్నపిల్లలు, గైనిక్ విభాగాలకు రోగులు ఓపీ కోసం బారులుదీరారు. చిన్న పిల్లలు, గైనిక్ ఓపీ వద్ద గంటల తరబడి రోగులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ప్రధాన ఓపీ కేంద్రాల వద్ద కూడా రోగులు వరుసలో పడిగాపులు కాశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రోగుల రద్దీ దృష్ట్యా మరిన్ని ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

జీడీడీపీ లక్ష్యం రూ.61,746 కోట్లు

5వ పేజీ తరువాయి

వస్తున్న అరకొర ఆదాయం కూడా కర్నూలు నగరంలో ఇండస్ట్రీస్, ఆదోని పట్టణంలోని పత్తి జిన్నింగ్ మిల్లుల ద్వారానే అధికంగా వస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో 11,774 కోట్లు జీవీఏ, గతేడాదిలో పోలిస్తే 17.68 శాతం వృద్ధిరేటు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే రూ.2,434 కోట్లు రాబట్టి 20.67 శాతం లక్ష్యం సాధించి రాష్ట్రంలో 21వ స్థానంలో ఉంటే, నంద్యాల జిల్లా 23.35 శాతం సాధించి 15వ స్థానంలో ఉంది.

సేవల లక్ష్యం రూ.25,927 కోట్లు

సేవల రంగం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25,927 కోట్లు స్థూల విలువ జోడింపు (జీవీఏ) సాధించాలని లక్ష్యం. గతేడాదిలో పోలిస్తే 15.73 శాతం వృద్ధి రేటు పెంచుకున్నారు. ఇప్పటి వరకు లక్ష్యంలో 5,616 కోట్లు (21.66 శాతం) రాబట్టి రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచారు. నంద్యాల జిల్లా జీవీఏ లక్ష్యం రూ.18,266 కోట్లే. అయినా 22.32 శాతం లక్ష్యాన్ని చేరుకొని 14వ స్థానంలో ఉంది.

జిల్లా తలసరి ఆదాయం రూ.2,25,099

వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాలు ద్వారా సాధించే స్థూల విలువ జోడింపు(జీవీఏ), నికర పన్నులు (నెట్ టాక్సెస్) ద్వారా వచ్చే రాబడిని జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)గా నిర్ధయిస్తారు. అందులో నికర జిల్లా స్థూల ఉత్పాదకత (ఎన్‌డీడీపీ) రాబడి ఆధారంగా జిల్లా ప్రజల సలసరి ఆదాయం లెక్కిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌డీడీపీ రూ.55,235కోట్లు అంచనా వేశారు. ప్రస్తుతం జిల్లా జనాభా 24,64,768 ఉన్నారు. ఈ లెక్కన జిల్లా తలసరి ఆదాయం రూ.2,25,099 అంచనా వేశారు. 2024-25లో ఎన్‌డీడీపీ రూ.47,250 కోట్లు కాగా, అప్పటి జనాభా 24,52,644 మందికి తలసరి ఆదాయం రూ.1,92,651లు నిర్ధారించారు. గత ఏడాదిలో పోలిస్తే తలసరి ఆదాయం రూ.31,448లు పెరిగింది. ఇవి అంకెలే వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికీ నెల జీతం రూ.8-10 వేలు కూడా లేని నిరుద్యోగులు ఎందరో ఉన్నారు. గ్రామీణ కూలీలకు ఏడాదిలో సగం రోజులు పనులే ఉండవు. నిరుపేదల తలసరి ఆదాయం ఎంత..? ఆర్థిక నిపుణుల వద్ద కూడా సమాధానం లేని ప్రశ్న ఇది.

ఆయా రంగంల్లో 2025-26 జీవీఏ లక్ష్యం, సాధించిన పురోగతి, సాధించాల్సిన లక్ష్యం.. రూ.కోట్లల్లో

వివరాలు	వ్యవసాయం	పరిశ్రమలు	సేవలు
లక్ష్యం (టార్గెట్)	18,985	11,774	25,927
పెరుగుదల శాతం	18.26	17.68	15.73
సాధించిన లక్ష్యం	1,530	2,434	5,616
శాతం	8.06	20.67	21.66
సాధించాల్సిన లక్ష్యం	17,455	9,340	20,311
శాతం	91.94	79.33	78.44

ఆధునిక కాలానికి అనుగుణంగా కథలు రావాల్సిన అవసరం ఉంది


కథలపై సమీక్షిస్తున్న ప్రముఖ కథా రచయితలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఆధునిక కాలానికి అనుగుణంగా కథలు రావాల్సిన అవసరం ఉందని ప్రముఖ కథారచయిత ఆర్ఎం ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో కథా రచయితల సమావేశం జరిగింది. ఇందులో కథా రచయితలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం పెరిగిన రోజుల్లో కథలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య జనులకు అతి దగ్గరగా ఉండే సాహితి ప్రక్రియ కవిత అని తెలిపారు. దీంతో పాటు కథ విశేష ఆదరణ కలిగిందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన కథను నేటి యువతరానికి చేర్చాల్సిన బాధ్యత కూడా రచయితలపై ఉందన్నారు. అనంతరం అనేక మంది రచనలపై చర్చాగోష్టి జరిగింది. జిల్లా కో ఆపరేటివ్ అధికారి జి.వెంకట కృష్ణతోపాటు రచయితలు డా.ఎం.హరికిషన్, మారుతి పురోహితం, వెంకటేశ్వరరెడ్డి, ఇనయతుల్లా, తెలుగు వెంకటేశ్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ (ఐసీయూ) సివిల్ వర్క్ పనులు వేగవంతం చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం ఆయన క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. సివిల్ వర్క్‌తో పాటు ఎలక్ట్రికల్ వ్యవస్థలు ఆక్సిజన్‌లైన్స్, సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ వంటి సదుపాయాలను ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ సూచించారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి: సీపీఎం

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం బృందం కోరింది. సోమవారం వర్కూరు గ్రామం వద్ద పొలాల్లో ఉల్లిని సీపీఎం నాయకులు పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటిం చిన మద్దతు ధర రూ.1200లకు అమ్ముకుంటే రైతుకు రూ.40 వేలు కూడా వచ్చే పరిస్థితి గగనమన్నారు. దీనికి తోడు అధిక వర్షాలు రైతును మరింత కుంగదీశాయని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రూ.2500 మద్దతు ధర కల్పించాలని కోరారు.

పోస్టర్ విడుదల

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా-అర్బన్ 2.0 పథకాలపై విస్తృత ప్రచారం లో భాగంగా సోమవారం కార్పొరేషన్ కమిషనర్ విశ్వనాథ్ కార్యాలయంలో అంగీకార్-2025 పథకం పోస్టర్‌ను విడుదల చేశారు. కమిషర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన- అర్బన్ 2.0 కింద కేంద్ర ప్రభుత్వం 'అంగీకార్ 2025' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అడిషనల్ కమిషనర్ ఆర్ జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

పేదల మనిషి ఏచూరి : సీపీఎం

కర్నూలు రూరల్ సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేదల మనిషి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ అన్నారు. కర్నూలు మండలం గొందిపర్ల, ఈ.తాండ్రపాడు, ఉల్చాల గ్రామాల్లో సోమవారం సీపీఎం నాయకులు పర్యటించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సి.బెళగల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్ దొడ్డి గ్రామానికి చెందిన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రసూల్, ఈశ్వర్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ సత్యం తెలిపారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రసూల్, ఈశ్వర్‌లు జిల్లా స్థాయి సైక్లింగ్ అండర్ 14 విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. శుక్రవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు హెచ్ఎం హకీమ్ బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో ఆదాం బాషా వంట ఏజెన్సీలకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని ఉన్నత, స్పెషల్, కోట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

అర్జీలను పరిష్కరించాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):అర్జీలను పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాక్‌వుడ్ మెమోరియల్ పాఠశాలలో 1976-1986 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై మాట్లాడారు.


గురువును సన్మానించి.. మెమోంటో అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఆటో అండ్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు రాము అధ్యక్ష తన ధర్నా నిర్వహించారు. మునెప్ప మాట్లాడుతూ ఆటో కార్మికు లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నెంబరు 21, 31ని రద్దు చేయాలిని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి: 34వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట స్థానిక కాలనీ వాసులతో కలిసి ధర్నా చేశారు.

ర్యాంకులతోపాటు మార్కులు ప్రకటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన టీచర్ల ర్యాంకులతోపాటు కేటగిరీలో మార్కులతో జాబితా ప్రకటించాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. సోమవారం డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరె కృష్ణ జిల్లా శాఖ అధ్యక్షులు వీజీ వెంకట్రాముడు హాజరై మాట్లాడారు. ప్రతి సం వత్సరం దసరా సెలవులు మహాలయ అమావాస్య నుంచి ఇస్తున్నట్లుగానే ఈ నెల 22వ తేదీ నుంచి దసరా సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

కల్లూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు విద్యుత్‌శాఖ సర్కిల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఓర్వకల్లు: విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నన్నూరు 400 కేఈ సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న విద్యార్థులు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు హైలెవెల్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలయ్య, భరత్ కుమార్, లక్ష్మయ్య, మహ్మద్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి


ఓర్వకల్లులో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, లెక్చరర్లు మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతిని నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌యూ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మోక్ష గుండం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఇంజ నీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఎంపీడీవో శ్రీని వాసులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇంజనీర్లు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపీపీ ఉన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

కల్లూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 32వ వార్డులోని పంది పాడు రోడ్డు సుఖీభవ ఆస్పత్రి ఎదురుగా ప్రధాన రహదారిపై మురుగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కే.సుధాకరప్ప ఆధ్వర్యంలో పందిపాడు ప్రధాన రహదారిపై నిలిచిన మురుగును పరిశీలించారు. గత 15 రోజులుగా రోడ్డుపై మురుగు నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్ర మంలో ఆనంద్, హుసేన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై మంత్రి టీజీ దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత నగరంలోని కవాడీ వీధిలోనీ కీర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గోడ కూలి రహీబ్‌బాషా అనే విద్యార్థి మృతి చెందిన ఘటనపై మంత్రి టీజీ భరత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థి మృతి బాధాకరం: ఎంపీ

నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో గోడ కూలి ఓ విద్యార్థి మృతి చెందడం బాధాకరమని ఎంపీ నాగారాజు అన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు.

కేసు నమోదు చేయాలి: సోమిశెట్టి

పాఠశాలలో గోడకూలి విద్యార్థి మృతి చెందడం బాధాకరమని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. విషయం తెలియగానే ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీ లించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని ఓ పాఠశాలలో గోడ కూలిపోయి ఓ విద్యార్థి మృతి చెందడంపై బీజేపీ జిల్లా నాయకులు రంగస్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

● పాఠశాలలో గోడ కూలి విద్యార్థి మృతి చెందడంపై హృదయ విదారక సంఘటన అని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు, రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు అన్నారు. విద్యార్థి నాయకులు పాఠశాల ముందు ధర్నా చేశారు.

కర్నూలు న్యూసిటీ: పాఠశాల గుర్తింపును రద్దు చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్ డిమాండ్ చేశారు. పాఠశాల వద్ద నిరసన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణాపురానికి చెందిన మాదన్న పదేళ్ల క్రితం పెద్దపాడు గ్రామానికి వలస వెళ్లి కుటుంబంతో స్థిరపడ్డాడు. కర్నూలులో హమాలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల సోదరుడు ప్రమాదంలో మృతి చెందడంతో మూడురోజుల దినకర్మకు స్వగ్రామానికి వ చ్చారు. కార్యక్రమ అనంతరం ఆదివారం సాయంత్రం మాదన్న తన భార్య సావిత్రమ్మ, మనుమడు మధు కలిసి స్కూటర్‌పై పెద్ద పాడుకు బయలుదేరారు. అయితే కొత్తూరు వద్ద రోడ్డు మధ్య ఉంచిన లారీని వాహనాల వెలుతురులో గుర్తించలేక ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. ప్రమాదంలో దంపతులతోపాటు మనుమడు గాయప డ్డారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మాదన్న మృతి చెందాడు. భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డీవై స్వామి తెలిపారు.

మహిళల కోసం వైద్యశిబిరాలు


డా.అమర్నాథ్

తుగ్గలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయుర్వేదిక్ వైద్యుడు అమర్నాథ్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వస్థక్ పరివార్ అభినయ్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మందులు అందిస్తామన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

దేవనకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని పూజిత చదువుకు జనసేన నాయకులు రూ.30వేలను అందజేశారు. పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వెంకప్ప ఆదేశాల మేరకు సోమవారం విద్యార్థిని అగ్రికల్చర్ బీఎస్సీ చదివేందుకు సాయం చేసినట్లు నాయకులు ఉచ్చీరప్ప తోలినాకె, రామాంజినేయులు, బాలు, గోవిందు, చంటి, ఈశ్వర్, సరోజ ఉన్నారు.

'మహిళలకు రక్షణ కరువు'

ఆదోని రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో



మాట్లాడుతున్న నిర్మల

మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని, రక్షణ కరువైందని ఐద్వా మహిళా సంఘం నాయకురాలు నిర్మల ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నేరవేర్చాలన్నారు. సుజాతమ్మ, పాండవగల్లు సర్పంచ్ ఉమాదేవి, మాజీ కౌన్సిలర్ ముత్తమ్మ, మునెమ్మ, పద్మ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు లక్ష్మన్న, గోపాల్, తిప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. అధిక వర్షాలతో దోమలు వ్యాప్తి చెంది, డయేరియా, మలేరియా, డెంగీ ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు, ఫాగింగ్ చేయాలని కోరారు. వెంకటేష్, వీరేష్, నాగరాజు, మోహన్ ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మోహన్ విజయకుమార్

మద్దికెర సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ మోహన్ విజయకుమార్ సూచించారు. సోమవారం మద్దికెర, బురుజుల గ్రామాల్లో పంటలను పరిశీలించారు. టమోటన, పత్తి, బీర, మెరప, పెసర పంటలు ఎర్రబారుతున్నాయన్నారు. పంట నష్టం జాబితాను వ్యవసాయ సిబ్బంది అంచనావేసి పంపింపాలని సిబ్బందికి సూచించారు. ఏవో అధికారి రవి, వ్యవసాయ సిబ్బంది బోజరాజు, ఆనంద్ ఉన్నారు.

పాముకాటుతో రైతు మృతి


రవి (ఫైల్)

ఆలూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికెర గ్రామానికి చెందిన రైతు కుప్పగల్ రవి(32) పాముకాటుతో మృతిచెందాడు. బాధితులు తెలిపిన మేరకు.. సోమవారం పొలంలో కూలీలతో పత్తి విడిపిస్తుండగా పాముకాటు వేసింది. బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రవి మృతిచెందాడు. రవికి ఇద్దరు కుమార్తెలు, భార్య లలితమ్మ ప్రస్తుతం 9 నెలల గర్భిణి. ఎమ్మెల్యే బి.వి రుపాక్షి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సర్పంచ్ కుప్పగల్లు నాగరాజు, ఉప సర్పంచ్ లక్ష్మినారాయణ సంతాపం తెలిపారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. సోమవారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోవాలని కోరారు. కార్మికులచే కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించామన్నారు. కార్యదర్శులు, శివకుమార్, విజయకుమార్ తెలిపారు.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టమాటాకు


టమోటా రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మార్కెట్ యార్డులో టమాటా విక్రయాలను పరిశీలించారు. టమోటా రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కిలో రూ.10ల మేరకు కొనాలని చైర్మన్ నబిసాహెబ్, సెక్రటరీని కోరగా స్పందించిన చైర్మన్ కిలో రూ.8ల చొప్పున కొనుగోలు చేయాలని వ్యాపారులను ఆదేశించారు. రాధాకృష్ణ, వీరశేఖర్, చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి, సిద్ధయ్యగౌడ్, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆరుబయట చదువులు

● ఆలూరు మండలం కాత్రికి గ్రామ పాఠశాలలో పెచ్చులూడిన పైకప్పు



ఆరుయబట చదువుతున్న విద్యార్థులు, ఇన్‌సెట్‌లో పెచ్చులూడి కిందపడిన పైకప్పు

ఆలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాత్రికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడింది. ఇప్పటికే భవనం శిథిలావస్థలో ఉండగా, భారీ వర్షాల ప్రభావానికి పైకపు పెచ్చులూడింది. రాత్రి సమయం కావడంతో విద్యార్థులు లేరు, దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారుల ఆదేశాలతో శుక్రవారం ఉదయం పిల్లలను పాఠశాల బయటే కూర్చోబెట్టి చదువులు కొనసాగించారు. ఈ విషయమై ఎంఈవో-2 చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో తరగతి గదులు మూయించి విద్యార్థులను బయట కూర్చోబెట్టాలని ఉపాధ్యాయుడికి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పాఠశాలకు మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

కుంగిన గోదాం



మండలంలోని మాచనూరు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోదాం కుంగిపోయింది. నాబార్డు నిధులు రూ.40 లక్షల తో పనులు నాసిరకంగా చేశారని రైతులు అర్జునప్ప, ప్రహ్లాద, వెంకటరాముడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిచేయాలని కోరుతున్నారు.
- హాలహర్వి

సాగు భూములు లాక్కోవడం తగదు


మణేకుర్తి గ్రామంలో రామకృష్ణతో మాట్లాడుతున్న రైతులు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆలూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ ఏర్పాటుకు కోసం సారవంతమైన సాగు భూములను లాక్కోవడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం మణేకుర్తి గ్రామంలో పొలాలను పరిశీలించారు. భూముల మీదే ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని రైతులు విన్నవంచారు. రామకృష్ణ మాట్లాడుతూ ఈ విషయమై ట్రాన్స్ సీఎండీ విజయానంద్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామన్నారు. గిడ్డయ్య, గౌస్‌దేశాయి, రామచంద్రయ్య, నాయకులు నారాయణస్వామి, హనుమంతు ఉన్నారు.

సురవరం ఆశయ సాధనకు కృషి

ఆలూరు: దివంగత సీపీఐ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి మొలగవల్లిలో రామాంజనేయులు అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఆవుల శేఖర్, సర్పంచ్ మోహన్‌రాజ్ ఉన్నారు.

వందేళ్లుగా పోరాడుతున్న సీపీఐ

క్రిష్ణగిరి: సీపీఐ వందేళ్లుగా ప్రజల తరుపున పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కటారుకొండ గ్రామంలోని చెరువు వద్ద నాయకులతో కలిసి 100 మెక్కలను నాటారు. గిడ్డయ్య, రంగనాయుడు, రామంజనేయులు, కటారుకొండ, బోయ బొంతిరాళ్ళ సర్పంచ్‌లు నక్కీ లెనిన్‌బాబు ఉన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్


దివ్యాంగుడి సమస్య వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీవో తిమ్మక్క, ఆర్‌అండ్‌బి ఈఈ పద్మనాభరెడ్డి, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డిప్యూటీ డీఈఓ వెంకటరమణరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఏవో రమాదేవి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి...

ఆదోని రూరల్: అధిక వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు అజయ్ బాబు, కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఫీజు క్యారియర్లు, వైర్లు ధ్వంసం


ధ్వంసమైన ఫీజు క్యారియర్లు

క్రిష్ణగిరి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమకతాడు గ్రామంలో ఆదివారం రాత్రి తాగునీటి పథకం విద్యుత్ మోటర్ల ఫీజు క్యారియర్‌తోపాటు తీగలను దుండగులు ధ్వంసం చేశారు. దీంతో గ్రామానికి తాగునీటి సరపరా ఆగిపోయింది. ఇలా పలుమార్లు అవుతోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులో చేపలు వదిలేందుకు వేలం


జొన్నగిరిలో చేపల వేలం నిర్వహిస్తున్న అధికారులు

తుగ్గలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి చెరువులో చేపలు వదిలేందుకు సోమవారం వేలం నిర్వహించారు. సర్పంచ్ ఓబులేసు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి వేలం నిర్వహించగా, తగ్రామానికి చెందిన బారికి సురేష్, రూ.11.55లక్షలకు దక్కించుకున్నారు. ఈ ఏడాది రూ.4.05లక్షలు అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సలహాదారుడు లక్ష్మణస్వామి, బాలన్న, మిద్దె రవికుమార్, సంగాల కృష్ణ, జయరాం, బలరాముడు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):


వేడుకల్లో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

మిల్టన్ పాఠశాలలో హిందీ దివాస్, ఇంజనీర్స్‌డేను కరస్పాండెంట్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. హిందీని 1949లో అధికార భాషగా గుర్తించారని, అలాగే ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను విద్యార్థులకు పరిచయం చేశారు. ప్రిన్సిపాల్ నాగరాజు, టీచర్లు వెంకటేష్, సుశీల, లావణ్య, మెహ్రాన్నీస పాల్గొన్నారు.

గుంతలమయమైన రహదారి

ఆదోని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నల్లగేటు


గుంతను పరిశీలిస్తున్న గుడిసె కృష్ణమ్మ

వద్ద రహదారిపై భారీ గుంత ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ గుంతను పరిశీలించి, అధికారులతో చర్చించారు. ఇప్పటికే నిధులు మంజూరయ్యిందని, వర్షం తగ్గగానే పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ రాంభీంనాయుడు, మాజీ ఎంపీపీ మురళి, మల్లయ్య, బంగారుబాబు, విజయ్, పెద్దచిట్టి, చిన్నచిట్టి తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర బాధ్యతలు తీసివేయాలి

పత్తికొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల బాధ్యతలను తీసివేయాలని యూటీఎఫ్ సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. బస్సు యత్రర సోమవారం సాయంత్రం పత్తికొండకు చేరుకుంది. యూటీఎఫ్ నాయకులు ఆదోని రోడ్డులోని హంద్రీనీవా నాలుగు స్థంబాల కూడలివరకు బైక్‌ర్యాలీతో బస్సుయాత్రకు స్వాగతం పలికారు.

క్యూఆర్ కోడ్‌తో బిల్లులు చెల్లించండి

మద్దికెర సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు బిల్లులో ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బిల్లులు చెల్లించవచ్చని ఏఈ మహ్మద్ రఫిక్ సూచించారు. సోమవారం విద్యుత్ కార్యాలయంలో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. బిల్లుల చెల్లింపును సులభతరం చేసేందుకు క్యూఆర్‌కోడ్ ఉంటుందన్నారు. లైన్‌మెన్ వెంకటరమణ స్వామి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తే కేసు నమోదు చేస్తాం

హాలహర్వి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. సోమవారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని విక్రయిస్తుంటే తనకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం సేకరిస్తున్న వారి వివరాలు సేకరించి కేసు నమోదు చేయించాలని సూచించారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

ఆదోని టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియాను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, ఖాసిం వలి విమర్శించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గతేడాది 39.5 లక్షల టన్నుల ఎరువులను రైతులు వినియోగించుకుంటే, ఈ ఏడాది కేవలం 32 లక్షల టన్నుల ఎరువులు మాత్రమే సరిపోతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయినాథ్, మారుతీ రావు, వీరేష్ యాదవ్, శ్రీనిత్, దేవిశెట్టి వీరేష్ మాణిక్య రాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ మృతి

● పనికి వెళుతుండగా ప్రమాదం

క్రిష్ణగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపాడు-పెనుమాడ గ్రామాల మధ్య ట్రాక్టర్ బోల్తా పడి కోయిలకొండ గ్రామానికి చెందిన సరస్వతి(45) సోమవారం మృతి చెందారు. వివరాల మేరకు.. ఎరుకల చెరువు గ్రామంలో వేరుశనగ నూర్పిడి కోసం ట్రాక్టర్‌లో బయలుదేరారు. కంబాలపాడు- పెనుమాడ గ్రామాల మధ్యలో ట్రాక్టర్ టైర్ ఊడి సర్వసతి అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

ఆలూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మణేకుర్తిలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయాలని ఎమ్మెల్యే విరుపాక్షి డిమాండ్ చేశారు. సోమవారం మణేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహాన్ని పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం గాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మరో విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.20 వేలు అందించారు. వైసీపీ నాయకులు తెర్నెకల్ సురేంద్రరెడ్డి, మల్లికార్జునరెడ్డి, చిన్న ఈరన్న, మల్లికార్జున, గిరి పాల్గొన్నారు.


కనకదాసు విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి


ఇంజనీర్‌ను సన్మానిస్తున్న ఆవోపా సభ్యులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు సూచించారు. సోమవారం పట్టణంలో ఆవోపా, వామ్ సంస్థలు సంయుక్తంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. సివిల్ ఇంజనీర్, ఇంటీరియర్ డిజైనర్ జితేంద్ర నాథ్ తివారి, పీఆర్ ఈఈ పద్మజ, సూపరింటెండెంట్ నాగలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేష్ బాబు, పి.రఘు, వంకదారు మమతా శ్రీ, శ్రీదేవి, సంతోషి, లక్ష్మి పాల్గొన్నారు.

● లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డా.గోపీనాథ్, ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంజనీర్లు హరిత, యశస్వినీ, లక్ష్మన్, అలేఖ్య, కిరణ్, నితిన్‌ను సన్మానించారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి

దేవనకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో జ్యోతి ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఇంజనీరింగ్, వేల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉదయం పది గంటల్లోపు హాజరుకావాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యలను పూర్తిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌వో నాయకులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ ప్రవేశాలను వెంటనే ప్రారంభించాలని పీడీఎస్‌వో నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల వద్ద మాట్లాడుతూ ప్రభుత్వం డిగ్రీ ప్రవేశాలను ఆలస్యం చేయడంపై ప్రశ్నించారు. ఇంటర్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలైందని డిగ్రీలో చేరేందుకు విద్యార్థులు ఎదురుచూస్తున్నారు అన్నారు. శివ, రాజేష్, సమర్థ వసంత్ కుమార్, రాజుబాబు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో సుహాసినమ్మ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సమయపాలన పాటించని శ్రీరంగాపురం సచివాలయ ఉద్యోగులకు 'మెమో'లు జారీచేశారు.


కుట్టుమిషన్లు ఇస్తున్న గ్రామస్తులు

కుట్టు మిషన్లు విరాళం

దేవనకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రానికి చెందిన సదాశివరావు, వేణుగోపాల్‌రావు కెజీబీవీ పాఠశాలకు రెండు కుట్టు మిషన్లను విరాళం ఇచ్చారు. వీటిని ప్రిన్సిపాల్ సునీతకు అందేశారు. విద్యార్థినులకు కుట్టు మిషన్లతో ఉపయోగం ఉందని ప్రిన్సిపాల్ అన్నారు. చిట్టెం నాగేష్, కృష్ణమూర్తి ఉన్నారు.

జీడీడీపీ లక్ష్యం రూ.61,746 కోట్లు

5వ పేజీ తరువాయి

వస్తున్న అరకొర ఆదాయం కూడా కర్నూలు నగరంలో ఇండస్ట్రీస్, ఆదోని లోని పత్తి జిన్నింగ్ మిల్లుల ద్వారానే అధికంగా వస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో 11,774 కోట్లు జీవీఏ, గతేడాదిలో పోలిస్తే 17.68శాతం వృద్ధిరేటు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే రూ.2,434 కోట్లు రాబట్టి 20.67 శాతం లక్ష్యం సాధించి రాష్ట్రంలో 21వ స్థానంలో ఉంటే, నంద్యాల జిల్లా 23.35 శాతం సాధించి 15వ స్థానంలో ఉంది.

సేవల లక్ష్యం రూ.25,927 కోట్లు:

సేవల రంగం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25,927 కోట్లు స్థూల విలువ జోడింపు (జీవీఏ) సాధించాలని లక్ష్యం. గతేడాదిలో పోలిస్తే 15.73 శాతం వృద్ధి రేటు పెంచుకున్నారు. ఇప్పటి వరకు లక్ష్యంలో 5,616 కోట్లు (21.66 శాతం) రాబట్టి రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచారు. నంద్యాల జిల్లా జీవీఏ లక్ష్యం రూ.18,266 కోట్లే. అయినా 22.32 శాతం లక్ష్యాన్ని చేరుకొని 14వ స్థానంలో ఉంది.

తలసరి ఆదాయం రూ.2,25,099

వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాలు ద్వారా సాధించే స్థూల విలువ జోడింపు(జీవీఏ), నికర పన్నులు (నెట్ టాక్సెస్) ద్వారా వచ్చే రాబడిని జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)గా నిర్ణయిస్తారు. అందులో నికర జిల్లా స్థూల ఉత్పాదకత (ఎన్‌డీడీపీ) రాబడి ఆధారంగా జిల్లా ప్రజల సలసరి ఆదాయం లెక్కిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌డీడీపీ రూ.55,235కోట్లు అంచనా వేశారు. ప్రస్తుతం జిల్లా జనాభా 24,64,768 ఉన్నారు. ఈ లెక్కన జిల్లా తలసరి ఆదాయం రూ.2,25,099 అంచనా వేశారు. 2024-25లో ఎన్‌డీడీపీ రూ.47,250 కోట్లు కాగా, అప్పటి జనాభా 24,52,644 మందికి తలసరి ఆదాయం రూ.1,92,651లు నిర్ధారించారు. గత ఏడాదిలో పోలిస్తే తలసరి ఆదాయం రూ.31,448లు పెరిగింది. ఇవి అంకెలే వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికీ నెల జీతం రూ.8-10 వేలు కూడా లేని నిరుద్యోగులు ఎందరో ఉన్నారు. గ్రామీణ కూలీలకు ఏడాదిలో సగం రోజులు పనులే ఉండవు. నిరుపేదల తలసరి ఆదాయం ఎంత..? ఆర్థిక నిపుణుల వద్ద కూడా సమాధానం లేని ప్రశ్న ఇది.

కోతకు గురైన జీడీపీ ఆనకట్ట

● పొంచి ఉన్న ప్రమాదం
● ఆందోళనలో అన్నదాతలు



గేట్ల దగ్గర భారీగా కోతకు గురైన జీడీపీ మట్టి కట్ట



కుంగిన మట్టి ఆనకట్ట

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టులో కొత్తగా నిర్మించిన మట్టికట్ట కోతకు గురై కొట్టుకుపోవడమే గాక కుంగిపోతుంది. కొట్టుకు పోయిన మట్టి అంతా రోడ్డుకు అడ్డంగా చేరుతుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. జరిగిన పనుల నాణ్యతపై ప్రజలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. గురు, శుక్ర, శనివారాలలో కురిసిన వర్షంకు ప్రాజెక్టు మొదలు నుంచి పిల్లిగుండ్ల సమీపం వరకు మట్టి కట్ట పగుళ్లు రావడమే గాక కోతకు గురైంది. వర్షంకు అనేక చోట్ల మట్టి కోతకు గురైంది. దీంతో నాణ్యత ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ లాంటి నాణ్యత లేని పనులు చేస్తే కట్ట ప్రమాదంలో పడిపోతుందని ప్రజలు, ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనుల ప్రారంభం మొదట్లోనే ఈ లాంటి నాణ్యత లేని పనులు కాంట్రాక్టర్ చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఏమి చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కట్ట నిర్మాణంలో గ్రౌండ్ లెవెల్ లో 8 నుంచి 18 మీటర్లు, టాప్ లెవెల్‌లో 6 మీటర్ల వెడెల్పు 4.313 కిలోమీటర్ల పొడువున మట్టి కట్ట నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. కోతకు గురైన ప్రాంతంలో మరోసారి నాణ్యతతో కూడిన పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఎత్తు పెంచడంలో జరుగుతున్న పనులలో కమీషన్‌ల కోసం గతంలో వైసీపీ నాయకులు, అధికారులు చేయి చాచడం కారణంగానే ఈ లాంటి నాణ్యత లేని పనులు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. చాలచోట్ల మట్టి కట్ట కోతకు గురైంది. ఇప్పటికైె జీడీపీ ఇరిగేషన్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని పగుళ్ల బారిన చోట నూతనంగా పనులు చేయించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యతతో పనులు చేయిస్తాం

కురిసిన వర్షంకు ప్రాజెక్టు మట్టి కట్ట కోతకు గురైన విషయం గురించి ని వివరణ కోరగా ప్రాజెక్టు మట్టి కట్ట కు లూజ్ మట్టిని వేయడం సరైన పద్ధతిలో రోల్ చేయక పోవడం వల్ల వర్షం నీటి కోతకు గురై కట్ట బీటలుపారింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి లూజ్ మట్టిని అంతా తీయించి కొత్తగా మట్టిని వేసి రోలర్‌లో గట్టి పడేవ రకు మట్టి కట్టపై తిప్పి పనులు నాణ్యతతో చేయిస్తామని తెలిపారు. విషయంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

● మహమ్మద్‌అలీ, ఏఈ, జీడీపీ

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి



అర్జీలు చూపిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేదలు తహసీల్దార్‌కు ఇచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కారించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక నందు పేదలు, ప్రజలు ఇచ్చిన అర్జీలను నెలల తరబడి పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమస్యల అర్జీదారులు పాల్గొన్నారు.

కౌతాళం మండలాన్ని విభజించాలి



వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కౌతాళం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):పరిపాలన సౌలభ్యము కొరకు పెద్ద మండలమైన కౌతాళం మండలంను 3 మండలాలుగా విభజించాలంటూ సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 3 మండలాలుగా విభజించాలని కోరారు.అనంతరం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు నాగరాజు, వీరేష్, రామలింగ, సత్యప్ప ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతూన్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్

పెద్దకడబూరు , సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని సీపీఐ కార్యలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు నాయకులు తిక్కన్న, సుభాన్, ఖాజా, మునిస్వామి, నబీ, ఖాసీం పాల్గొన్నారు.

ముస్లింలకు పెద్దపీట



రాఘవేంద్రరెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న ముస్లింలు

కోసిగి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లింలకు పెద్ద పీట వేసిందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలో నూతన సున్నీ జామియా మసీదును ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ప్రారం భించారు. ముఖ్యఅతిథులుగా రాఘవేంద్రరెడ్డి, ముస్లీం మైనార్టీ నాయకులు ఇమామ్, హజీజ్, మహబూబ్ బాషా, మహ్మద్ అబ్దుల్ షకుర్‌లు పాల్గొన్నారు. మతపెద్దలు, ముస్లింలు టీడీపీ నాయకులు ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి పూలమాలలతో సన్మానం చేశారు. అనంతరం ముస్లిం మత పెద్దలుమాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, ముత్తురెడ్డి, నర్సారెడ్డి, జ్ఞానేష్, అయ్యన్న, దొడ్డయ్య, ఈరేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కేసు

మంత్రాలయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎదుటి వారి ప్రాణాలు కూడా తీయడం నేరమని, డ్రంకెన్ డ్రైవ్ నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక, విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ చెప్పారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించా లని యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి ప్రచార యాత్ర పేరుతో ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం నందు సోమవారం భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే శుద్ధజలంతో పూజించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మహమంగళహారతితో పూజించి నాగపూజ, గోపూజ, నవగ్రహాల పూజలు చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు.

అభివృద్ధికి కేరాఫ్ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యే బీవీ కుంటుంబం అని పట్టణంలో ఎవరిని అడిగిన చెబుతారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు కలీముల్లా, ప్రదాన కార్యదర్శి నరసింహులు, అల్‌ఫ్రెడ్ రాజ్, నరసప్ప, అంబేద్కర్, విజయలక్ష్మి అన్నారు. మాజీ కౌన్సిలర్ మధుబాబు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మాల రాజేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను జయప్రదం చేయండి

కోసిగి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఈ నెల 27న కోసిగి మండల కేంద్రంలోని బెళగల్ రోడ్డులో ఉన్న మౌంట్ కార్మెల్ హై స్కూల్‌లో మెగా జాబ్‌మేళాను జయప్రదం చేయాలని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8019291249 ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, ముత్తురెడ్డి, సురేష్ నాయుడు, చింతలగేని నర్సారెడ్డి, రామకృష్ణ, లక్ష్మయ్య, వెంకటేశ్, తాయన్న పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నందవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరక్షరాశ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి ప్రతాప్ కోరారు. సోమవారం నందవరం శ్రీశక్తి భవనంలో ఏపీయం రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర వాలంటరీ మహిళలకు శిక్షణ జరిగింది. కార్యక్రమంలో డిఆర్‌డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాల బేగారుల సమస్యలు పరిష్కరించాలని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర ప్రతినిధి సి రంగయ్య కోరారు. సోమవారం స్థానిక వివర్స్ కాలనీ గ్రౌండ్ నుంచి వైఎస్సార్ సర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో మాల బేగారులు వందలాదిగా పాల్గొన్నారు.

అనువైన చోట ఇంటి స్థలాలు ఇవ్వాలి

కౌతాళం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళులేని పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలనుకుంటున్న తరుణంలో ప్రజలకు అనువైన ప్రదేశంలో ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కౌతాళం సింగిల్ విండో చైర్మన్ వెంకటపతిరాజు కోరారు. వైసీపీ అధికారం చేపట్టిన 5 సంవత్సరాలలో ఒక్క ఇల్లు కూడా అక్కడ నిర్మాణం ఎవరు చేపట్టలేదని అలాంటి చోట ఇంటి స్థలాలను పేదల పేరిట ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు, సొసైటీ సభ్యుడు వీరేష్, డాక్టర్ రాజానందు, గిరి, రామచంద్ర, గురు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలి

మంత్రాలయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న 12వ పీఆర్‌సీని ప్రకటించి ఇవ్వాలని ఆపస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయం పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. ఇంగ్లీషు మీడియం సమాంతరంగా తెలుగు మీడియంలో కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆపస్ ఆదోని డివిజన్ కార్యదర్శి ప్రాణేష్ ఆచారి, యువరాజు, బ్రహ్మయ్య ఆచారి, హరిక్రిష్ణ ప్రసాద్, పూజిత్, తదితరులు పాల్గొన్నారు.

కోసిగిలో కబడ్డీ పోటీలు ప్రారంభం

కోసిగి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చావిడి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి వలకలదిన్నె వెంకటేశ్, ఉపాధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ పోటీలు సోమవారం కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, రాకేష్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, సురేష్‌నాయుడు, ముత్తురెడ్డి, సతీష్‌నాయుడు, అయ్యన్న, పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

నందవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని హలహర్వి గ్రామంలో యూరియా రావడంతో రైస్‌మిల్ అషోషియేషన్ తాలుకా అధ్యక్షుడు నారాయణరెడ్డి, అధికారులు సోమవారం రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో రైతులకు యూరియాను నేరుగా అదజేయాలని ఆదేశించారన్నారు. పాసు పుస్తకం గల ప్రతి రైతుకు 3 సంచుల ప్రకారం యూరియాను ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రతి రైతుకు యూరియా అందిస్తున్నామని ఎమ్మెల్యే బీవీ రైతులకు యూరియా లోటు రాకుండా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్నాథరెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఎర్రన్న పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట మహోత్సవం



స్వామి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో వెలసిన శ్రీచింతలాముని, నల్లారెడ్డి స్వాములు దశమి ఉత్సవాలలో భాగంగా సోమవారం పార్వేట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో భాగంగా స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు, ఆకుపూజ, మహామంగళహారతి, నైవేద్యసమర్పణ చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. రాత్రి స్వామి భక్తి గీతాలతో కూడిన భజన నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రాఘవరాయలకు పంచామృతాభిషేకం



అలంకరణలో బృందావనం

మంత్రాలయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృంధావనానికి, మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. సోమవారం భాద్రపద నవమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి పట్టువస్త్రాలతో దేవతామూర్తులకు శోభయానుమానంగా అలంకరించారు. రాఘవరాయునికి, మంచాలమ్మకు పీఠాధిపతి మహామంగళహారతలు ఇచ్చారు. వివిద రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మంత్రాలయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్ నుంచి నలుగురు 5 కిలోమీటర్ల పరుగుపందెంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైయ్యారనీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. ప్రసాద్, షరీఫ్, వలి, ఫిజికల్ డైరెక్టర్ ఉరుకుందప్ప, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ కోసం స్థల పరిశీలన



పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాసులు

మంత్రాలయం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఎన్నో ఏళ్లుగా మంత్రాలయంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఆర్‌పీవీఎఫ్, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల పోరాటంతో మంత్రాలయంలో బాలికల ప్రిమెట్రిక్ హాస్టల్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా, కృష్ణ, మంత్రాలయం, ఎమ్మిగనూరు వార్డెన్లు అజీమ్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ అన్నారు.. దగా చేశారు: టీడీపీ



నందవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను దగా చేశారని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు ఆరోపించారు. సోమవారం నందవరంలో మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో ఏపీ బీసీ కో- అపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ రాముడు. సహకార సంఘం మండల అధ్యక్షుడు దర్మాపురం గోపాల్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు వీరేష్, ఆదిశేషు, డబ్బాఈరన్న పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ.. తాగునీటి కొళాయి

గోనెగండ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీటికి ఇబ్బంది లేకుండా కొళాయి ఏర్పాటు చేయడమే కూటమీ ప్రభుత్వ లక్ష్యంఅని మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, హెచ్ కైరవాడి సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పిల్లిగుండ్ల నాగన్న, అలువాల సర్పంచ్ బాషా అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి రమణచౌదరి,పిల్లగుండ్ల కృష్ణ, కురవ మల్లయ్య, నజీర్‌సాహెబ్, బాషా, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, పాల్గొన్నారు.

జీడీడీపీ లక్ష్యం రూ.61,746 కోట్లు

5వ పేజీ తరువాయి

వస్తున్న అరకొర ఆదాయం కూడా కర్నూలు నగరంలో ఇండస్ట్రీస్, ఆదోని పట్టణంలోని పత్తి జిన్నింగ్ మిల్లుల ద్వారానే అధికంగా వస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో 11,774 కోట్లు జీవీఏ, గతేడాదిలో పోలిస్తే 17.68 శాతం వృద్ధిరేటు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే రూ.2,434 కోట్లు రాబట్టి 20.67 శాతం లక్ష్యం సాధించి రాష్ట్రంలో 21వ స్థానంలో ఉంటే, నంద్యాల జిల్లా 23.35 శాతం సాధించి 15వ స్థానంలో ఉంది.

సేవల లక్ష్యం రూ.25,927 కోట్లు:

సేవల రంగం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25,927 కోట్లు స్థూల విలువ జోడింపు (జీవీఏ) సాధించాలని లక్ష్యం. గతేడాదిలో పోలిస్తే 15.73 శాతం వృద్ధి రేటు పెంచుకున్నారు. ఇప్పటి వరకు లక్ష్యంలో 5,616 కోట్లు (21.66 శాతం) రాబట్టి రాష్ట్రంలో 16వ స్థానంలో నిలిచారు. నంద్యాల జిల్లా జీవీఏ లక్ష్యం రూ.18,266 కోట్లే. అయినా 22.32 శాతం లక్ష్యాన్ని చేరుకొని 14వ స్థానంలో ఉంది.

జిల్లా తలసరి ఆదాయం రూ.2,25,099

వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవల రంగాలు ద్వారా సాధించే స్థూల విలువ జోడింపు(జీవీఏ), నికర పన్నులు (నెట్ టాక్సెస్) ద్వారా వచ్చే రాబడిని జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)గా నిర్ణయిస్తారు. అందులో నికర జిల్లా స్థూల ఉత్పాదకత (ఎన్‌డీడీపీ) రాబడి ఆధారంగా జిల్లా ప్రజల సలసరి ఆదాయం లెక్కిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌డీడీపీ రూ.55,235కోట్లు అంచనా వేశారు. ప్రస్తుతం జిల్లా జనాభా 24,64,768 ఉన్నారు. ఈ లెక్కన జిల్లా తలసరి ఆదాయం రూ.2,25,099 అంచనా వేశారు. 2024-25లో ఎన్‌డీడీపీ రూ.47,250 కోట్లు కాగా, అప్పటి జనాభా 24,52,644 మందికి తలసరి ఆదాయం రూ.1,92,651లు నిర్ధారించారు. గత ఏడాదిలో పోలిస్తే తలసరి ఆదాయం రూ.31,448లు పెరిగింది. ఇవి అంకెలే వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికీ నెల జీతం రూ.8-10 వేలు కూడా లేని నిరుద్యోగులు ఎందరో ఉన్నారు. గ్రామీణ కూలీలకు ఏడాదిలో సగం రోజులు పనులే ఉండవు. నిరుపేదల తలసరి ఆదాయం ఎంత..? ఆర్థిక నిపుణుల వద్ద కూడా సమాధానం లేని ప్రశ్న ఇది.

ఆయా రంగంల్లో 2025-26 జీవీఏ లక్ష్యం, సాధించిన పురోగతి, సాధించాల్సిన లక్ష్యం.. రూ.కోట్లల్లో

వివరాలు	వ్యవసాయం	పరిశ్రమలు	సేవలు
లక్ష్యం (టార్గెట్)	18,985	11,774	25,927
పెరుగుదల శాతం	18.26	17.68	15.73
సాధించిన లక్ష్యం	1,530	2,434	5,616
శాతం	8.06	20.67	21.66
సాధించాల్సిన లక్ష్యం	17,455	9,340	20,311
శాతం	91.94	79.33	78.44